క్లుప్తంగా

19న విద్యుత్ సరఫరాకు అంతరాయం

కవిటి: బొరివంక ఉపవిద్యుత్ కేంద్రం పరిధిలోని అన్ని ఫీడర్ల గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని సంబంధిత అధికారులు ఓ ప్రకటనలో కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్‌లు, స్తంభాల మార్పు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖాధికారులు జి.ప్రసాద్, ఎల్.యోగి బుధవారం తెలిపారు.

నేడు వజ్రపుకొత్తూరులో మంత్రి సీదిరి ప్రచారం

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం వజ్రపుకొత్తూరు మండలంలో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉదయం నుంచి రాత్రి ఏడు గంటల వరకు చినవంక, డోకులపాడు, గుల్లలపాడు, తాడివాడ, కిడిసింగి, వజ్రపుకొత్తూరు, చిన్నకొత్తూరు గ్రామాల్లో ప్రచారం చేస్తారని పేర్కొన్నారు.

'సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి'



మాట్లాడుతున్న నాయకులు

కోటబొమ్మాళి: గత ఐదేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయని జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లయ్య అన్నారు. కోటబొమ్మాళిలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంపీగా పేరాడ తిలక్, ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు బొడ్డు అప్పన్న, నాయకులు దుక్క రామక్రిష్ణ,పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

సోంపేట చేరుకున్న ఈవీఎంలు



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న దృశ్యం

సోంపేట: సోంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల పంపిణీ కేంద్రం వద్దకు ఈవీఎంలు బుధవారం చేరుకున్నాయి. ఇచ్ఛాపురం నియోజక వర్గంలోని 299 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 38 బాక్స్‌ల్లో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి వచ్చినట్లు ఆర్వో సుదర్శన్ దొర తెలిపారు. సామగ్రిని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ కె.విజయ్ కుమార్, మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

తెప్పలకు కళాభారతి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాసకు చెందిన కళాకారుడు, రచయిత డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి కళాభారతి పురస్కారం వరించింది. విశాఖపట్నంలోని కళాభారతిలో 19వ రాష్ట్రస్థాయి సాంఘిక నాటికల పోటీలు ఐదు రోజులుగా జరిగాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు కళాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కృష్ణమూర్తి నటించిన నాటిక కళాభిమానుల అభినందనలు అందుకుంది. దీంతో ఆయన్ని విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతీ ట్రస్టీ సునర్ల రాంగోపాల్, పైడా విద్యా సంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, కళా భారతి ట్రస్టీ, కార్యదర్శి బి.ఆర్.కె.ప్రసాద్ కళాభారతి పురస్కారంతో సత్కరించి గౌరవించారు.

పెద్దమురహరిపురంలో రక్తదాన శిబిరం

వజ్రపుకొత్తూరు: శ్రీరామ నవమిని పురస్కరించుకుని యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో పెద్దమురహరిపురం గ్రామంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ కాశీబుగ్గ వారి సౌజన్యంతో 32 మంది యువకులు రక్త దానం చేశారు. రక్త దాతలకు ప్రశంసా పత్రంతో పాటు ఏడాదికి గాను ఒక్కొక్కరికీ రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, బ్లడ్‌గ్రూపు టెస్ట్, బీపీ, పల్స్, హిమోగ్లోబిన్ పరీక్షలు ఉచితంగా చేసి దుశ్శాలువలతో సన్మానించారు. సేవా సమితి వ్యవస్థాపకులు చింత మురళి, సభ్యులు జి.సునీల్, బి.విఘ్నేష్, ఎ.లక్ష్మణ, బి.గణేష్, కె.నిహాల్, హేమారావు, చలపతి, తులసీరావు, సంతోష్ ఉన్నారు.



సంతబొమ్మాళి: దండుగోపాలపురం సీతారాముని ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్



ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురం ఆలయంలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప తదితరులు



కాశీబుగ్గలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కల్యాణ వైభోగమే..

ఊరూరా పచ్చని పందిళ్లు.. ఎటు చూసినా ఆధ్యాత్మిక శోభే.. ఎవరి నోట విన్నా రామమయమే. మాఊరు దేవుడు..అందాల రాముడు పాటలే.. శ్రీరామ నవమి ఉత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామాలయాలను సుందరంగా అలంకరించారు. సీతారాముల కల్యాణం, పట్టాభిషేకాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా జరిపించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సుందర దృశ్యాలను భక్తజనం కనులారా వీక్షించి తరించారు. వేకువజాము నుంచి రామాలయ, ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు వెళ్లి పూజలు చేశారు. ఉత్సవకమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. పానకాన్ని పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు మరింత భక్తిభావాన్ని పెంచాయి. పూజా కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు భాగస్వాములయ్యారు.



కంచిలిలో రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రారంభమైన శ్రీరామ నవమి ఉత్సవాలు



కంచిలిలో రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రారంభమైన శ్రీరామ నవమి ఉత్సవాలు



వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురంలో అన్నప్రసాదం వితరణ



టెక్కలి: శంభానవీధిలో శ్రీరామనవమి పూజలు



సోంపేట: జింకిభద్రలో పూజలందుకున్న సీతాలక్ష్మణసమేత శ్రీరాముడు



కాశీబుగ్గ: పలాసలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు విగ్రహాలు



ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురంలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



కవిటి: దూగానపుట్టుగ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు



వజ్రపుకొత్తూరు: సూర్యమణిపురంలో రామాలయం వద్ద భక్తి గీతాలు ఆలపిస్తున్న భజన బృందం



కవిటి: కవిటికొత్తూరులో సీతారాముల కల్యాణోత్సవ అలంకారం



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో పూజలు



నందిగాం: కోటిపల్లిలో సీతారాములను దర్శించుకుంటున్న ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి తదితరులు



టెక్కలి: గోపినాథపురంలో శ్రీరామ సమేత సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



టెక్కలి: రోటరీనగర్ శాంతి సుధా మందిరంలో శ్రీరామ కల్యాణ చేస్తున్న భక్తులు



టెక్కలి: వంశధార కాలనీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

అభివృద్ధిని చూసిన ఓటేయండి

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఓటును వేయాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ కోరారు. మండలంలోని అంపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆమె బుధవారం ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను చేరువ చేశారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు ఇప్పిలి క్రిష్ణారావు, కొల్లి ఈశ్వరరావు, పలికల జయరాం, మద్ది అప్పారావు, స్థానిక సర్పంచ్ మద్ది మోహిని, జాడుపూడి ఎంపీటీసీ సభ్యురాలు జామి జయ, పాండూరు శ్రీధర్, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, డొక్కరి బలరాం, గణప సింహాచలం, మద్ది ఆదినారాయణ, మాజీ సర్పంచ్ రమేష్ గౌడో పాల్గొన్నారు.



కంచిలి: వృద్ధురాలితో మాట్లాడుతున్న పిరియా విజయ



ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

కవిటి: రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. మండలంలోని ఆర్.కరాపాడు పంచాయితీ కన్నుపుట్టుగ, జి.కరాపాడు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యేగా పిరియా విజయ, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ జల్లు యుగంధర్, మండల యూత్ కన్వీనర్ వై.అశోక్, బెందాళం జయప్రకాష్, పీఎం తిలక్, వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, కర్రి గోపయ్య, పాండవ శేఖర్, కాయ భీంసేన్, ఎం.లచ్చయ్య, ఝాన్సీ, పి.కృష్ణారావు, మామిడి సంతోష్ ఉన్నారు.



కవిటి: కన్నుపుట్టుగలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, నీలాపు చంద్రయ్య తదితరులు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి జరిగిన అభివృద్ధి తెలియజేయడంతోపాటు ఓటును అభ్యర్థిస్తూ కరపత్రాను అందజేశారు. మాజీ సర్పంచ్ నీలాపు చంద్రయ్య, బాగ వేణు, బుడత మోహనరావు, గుజ్జు శంకర రావు, నీలాపు మోహనరావు, చిన్న గురునాథం ఉన్నారు.

సీఎం జగన్ కోసం సిద్ధం



మాట్లాడుతున్న పేరాడ తిలక్

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

ఇచ్ఛాపురం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజానాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలుపించుకోవడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని ఆర్‌జే ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అధ్యక్షతన మున్సిపాలిటీ, మండలం పరిధిలోని బూత్ కమిటీ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ ముఖ్య నాయకులతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి ఇంటింటికీ వెళ్లి చేయాల్సిన ప్రచారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రజల కోసం.. పేదలకు అనుకూలంగా పనిచేసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. ఉద్దానం ప్రాంతాన్ని పీడిస్తున్న కిడ్నీ సమస్యకు దారిచూపించారన్నారు. అలాగే తాగు, సాగునీటిని అందించారన్నారు. ఈ విషయాలను ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు చింతా రవికుమార్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, ఏఎంసీ చైర్మన్ బాబూరావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ప్రకాశరావు పటాన్నయక్, పి.రాజశేఖర్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన డిల్లి, ఆశి పురుషోత్తం, పార్టీ నేతలు కారింగి మోహన్‌రావు, సల్లా దేవరాజు ఉన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయం

సంతబొమ్మాళి: సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ విజయానికి ప్రతిఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పాలతలగాం, ఉమ్మిలాడ, ఆర్‌హెచ్‌పురం, గోవిందపురం, వడ్డితాండ్ర, కోటపాడు, సంతబొమ్మాళి తదితర పంచాయతీల్లోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులను బుధవారం కలిసి అభ్యర్థుల విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు నాయకులను కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని అందించారు. నాయకులు పేరాడ రమేష్, పంగ రామయ్య, కొన్న శ్రీరాములు ఉన్నారు.



పీఏసీఎస్ అధ్యక్షుడు జగన్నాయకులకు సీఎం జగన్ చిత్రపటాన్ని అందజేస్తున్న పేరాడ రమేష్

వలంటీర్ల రాజీనామా



వజ్రపుకొత్తూరు: నగరంపల్లి సచివాలయంలో రాజీనామా చేసిన వలంటీర్లు



టెక్కలి: రాజీనామా పత్రాలను అధికారులకు అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలంలోని 96 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. పీఎంపురం, పల్లివూరు, మంచినీళ్లపేట, అక్కుపల్లి, చినవంక, నగరంపల్లి గ్రామాలకు చెందిన వలంటీర్లు ఆయా సచివాలయ కార్యదర్శులకు తమ రాజీనామాలను అందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం తమవంతు కృషి చేస్తామన్నారు.

టెక్కలి: బన్నువాడ పంచాయతీ పరిధికి చెందిన తొమ్మిది మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. సర్పంచ్ పోలాకి మోహన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు కె.అజయ్ కుమార్, నాయకులు డి.శ్రీను, డి.రంగబాబు, సీహెచ్.బాలకృష్ణ సమక్షంలో పత్రాలను అధికారులకు అందజేశారు.